క్లుప్తంగా

కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటాం



జింకల నారాయణను పరామర్శిస్తున్న గంగుల బిజేంద్రారెడ్డి

శిరివెళ్ల: కార్యకర్తల కుటుంబాలకు అన్నివిధాలుగా అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన బోయలకుంట్ల వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకుడు జింకల నారాయణను ఆదివారం మాజీ ఎమ్మెల్యే పరామర్శించారు. ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామ సర్పంచు జింకల నాగన్న, నాయకులు శివలింగం, జబ్బార్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బీ. అబ్దుల్ సలాం, జెడ్పీ వైస్ చైర్మన్ దిల్షాద్ బేగం, ఎంపీపీ నాయక్ వసీం, పార్టీ మండల అధ్యక్షుడు ఇందూరి ప్రతాపరెడ్డి, నాయకులు మేర్వ నాగభూషణంరెడ్డి, భూపాల్‌రెడ్డి, ధనంజయరెడ్డి, రమణారెడ్డి, నాగేశ్వరరెడ్డి ఉన్నారు.

భద్రావతి భావనారుషి స్వామికి జలాభిషేకం



కలశాల్లో జలాన్ని తెచ్చిన భక్తులు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని భద్రావతి భావనరారుషి కల్యాణ మండపంలో పద్మశాలీయ సంఘం ఆధ్వర్యంలో శ్రీభద్రావతి సమేత భావనారుషి స్వామి వారికి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా మొదటి రోజు స్వామి వారికి బిందె సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు 108 కలశాలతో చెరువు కట్ట నుంచి మేళతాళాలతో జలాన్ని ఊరేగింపుగా తీసుకొని వచ్చి స్వామి వారికి అభిషేకం చేశారు. అనంతరం గుడిపాటిగడ్డలో వెలసిన శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయాలనికి ఊరేగింపుగా వెళ్లి స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పించారు. సంఘం అధ్యక్షుడు గాజులవేణు, మున్సిపల్ మాజీ కౌన్సిల్ భీమునిపల్లె వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో విద్యార్థిని ప్రతిభ



అధికారుల నుంచి మెమొంటో అందుకుంటున్న సునీత

రుద్రవరం: మండలంలోని తువ్వపల్లె తిప్పమీదున్న ఏపీ మోడల్ పాఠశాల విద్యార్థిని సునీత వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చూపి మొదటి స్థానం దక్కించుకుందని పాఠశాల ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వరరావు ఆదివారం తెలిపారు. ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవం సందర్భంగా నంద్యాలలోని ఎస్‌పీజీ స్కూల్లో ఆదివారం వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. పోటీల్లో తమ పాఠశాల నుంచి సునీత, సంధ్య,మనోహర్ పాల్గొనగా సునీత మొదటి బహుమతి గెలుచుకుందని వివరించారు.

టీవీ మెకానిక్‌లు అభివృద్ధి చెందాలి



లోగోను ఆవిష్కరిస్తున్న ఫరూక్, అసోసియేషన్ సభ్యులు

నంద్యాల(అర్బన్): టెక్నాలజీని అందిపుచ్చుకుని టీవీ మెకానిక్‌లు అభివృద్ధి సాధించాలని న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. స్థానిక వివేకానంద ఆడిటోరియంలో ఆదివారం జిల్లా టీవీ మెకానిక్ అసోసియేషన్ అధ్యక్షుడు కన్నయ్యశెట్టి అధ్యక్షతన స్వర్వసభ్య సమావేశం నిర్వహించి లోగోను ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఫరూక్ మాట్లాడుతూ మెకానిక్‌ల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. డాక్టర్ రవికృష్ణ, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

బడ్జెట్‌తో సామాన్యులకు ఒరిగింది శూన్యం

నంద్యాల(న్యూటౌన్): నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ వల్ల సామాన్య ప్రజలకు ఒరిగిందేమీ లేదని, విభజన చట్టంలో హామీలను నెరవేర్చకపోవడం, నూతన ప్రాజెక్టులు లేకపోవడం బాధాకరమని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యవర్గ సభ్యుడు శంకర్ ఆదివారం ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ వ్యక్తులకు అనుకూలమైన బడ్జెట్‌గా అభివర్ణించారు. నిరుద్యోగ సమస్య పరిష్కారానికి మార్గాలు చూపించలేదన్నారు. రాష్ట్రానికి నిధులు తేవడంలో కూటమి ప్రభుత్వం అన్ని విధాల వైఫల్యం చెందిందని విమర్శించారు. మోడీ ప్రభుత్వం బీహార్‌లోని నితీష్‌కుమార్ ప్రభుత్వానికి వరాల జల్లు కురిపిస్తే ఏపీకి మొండి చేయి చూపించడం కూటమి నాయకుల వైఫల్యంగా పేర్కొన్నారు.రాంబాబు, ఆనంద్, శంకరయ్య పాల్గొన్నారు.

స్వామి వచ్చె.. వేడుక తెచ్చె

- ఆళ్లగడ్డ చేరుకున్న అహోబిలేశుడు
- గోవింద నామస్మరణతో మార్మోగిన పురవీధులు
- ఉత్సవ పల్లకీకి ఘన స్వాగతం పలికిన ప్రభుత్వ యంత్రాంగం
- పట్టణంలో ప్రారంభమైన తిరునాల



పట్టణంలోకి వస్తున్న అహోబిలేశుడి ఉత్సవ పల్లకీ



ప్రధాన రహదారిలో ఏర్పాటు చేసిన బొమ్మల దుకాణాలు



ఉత్సవమూర్తులకు పూజలు నిర్వహిస్తున్న డీఎస్పీ ప్రమోద్, సీఐ చిరంజీవి

ఆళ్లగడ్డ: అహోబిలేశుడి పార్వేట మహోత్సవాల్లో భాగంగా గ్రామగ్రామాన విశేష పూజలందుకుంటూ భక్తులకు దర్శనభాగ్యం కలిగిస్తూ ఊరేగుతున్న ఉత్సవ పల్లకీ ఆదివారం ఆళ్లగడ్డ పట్టణానికి చేరుకుంది. ఉత్సవమూర్తులైన శ్రీ జ్వాలా నరసింహ స్వామి, శ్రీ ప్రహ్లాదవరద స్వాములు అధిష్టించిన ఉత్సవ పల్లకీ ఉదయం పడకండ్లలో పూజలు ముగిసిన అనంతరం పట్టణ పొలిమేరలోని వక్కిలేరు బ్రిడ్జి పైకి రాగానే ఉత్సవమూర్తులకు పెద్ద సంఖ్యలో పట్టణవాసులు ఎదురేగి మంగళ వాయిద్యాలతో సంప్రదాయంగా స్వాగతం పలికి భుజాలపై మోసుకుంటూ పట్టణంలోని తీసుకొచ్చి సర్కార్ తెలుపుపై కొలువుంచారు.

కొనసాగిన సంప్రదాయం..

స్వామి ఉత్సవ పల్లకీ పట్టణ పొలిమేరకు చేరుకున్న వెంటనే అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు కుల,మతాలకు అతీతంగా మంగళ వాయిద్యాలతో ఎదురేగి ఘన స్వాగతం పలికారు. ఆనవాయితీ ప్రకారం ఉత్సవమూర్తులు మొదటగా ప్రథమ తెలుపు (సర్కారు తెలుపు)పై కొలువుదీరిన అనంతరం ఒక్కో ప్రభుత్వ శాఖ కార్యాలయం వద్దకు స్వామి దూతలు వెళ్లి ఆ కార్యాలయ అధికారిని, సిబ్బందిని పల్లకీ వద్దకు మంగళ వాయిద్యాలతో తోడ్కొని వచ్చి దర్శన భాగ్యం కల్పించడం బ్రిటీష్ కాలం నుంచి వస్తున్న సంప్రదాయం. నేటికీ అదే ఆనవాయితీని కొనసాగించారు. ఇందులో భాగంగా మొదట పురపాలక సంఘం (గ్రామ పంచాయతీ), తహసీల్దార్, పోలీసు, ఉప ఖజానా తదితర కార్యాలయ అధికారులు స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

మొదలైన తిరునాల..

శ్రీ అహోబిలేశుడి పల్లకీ రాకతో పట్టణంలో తిరునాల ప్రారంభమైంది. స్వామి వారి రాకతో పట్టణంలోని లోగిళ్లు బంధుమిత్రులు, ఆడపడుచులతో కళకళలాడుతున్నాయి. సాధారణంగా స్వామి వారి ఉత్సవ పల్లకీ ఏ గ్రామానికి వెళ్తే అక్కడ తిరునాల నిర్వహిస్తారు. తిరునాల సందర్భంగా పట్టణంలోని ప్రధాన వీధుల్లో వివిధ రకాల అంగళ్లు వెలిశాయి. కొనుగోలుదారులతో పట్టణ వీధులు, దుకాణ ప్రాంతాలు కిక్కిరిసి పోయాయి. చిన్న పిల్లలు, యువతీ యువకులు రంగుల రాట్నాల్లో తిరుగుతూ కేరింతలు కొడుతుంటే మహిళలు తమ ఇళ్లకు వచ్చిన ఆడపడుచులకు, స్నేహితులకు గాజులు, కుంకుమను బహుమతిగా ఇస్తున్నారు. దీంతో పట్టణంలో వెలిసిన గాజుల, కుంకుమ దుకాణాలు మహిళలతో నిండి పోయాయి. దాదాపు వారం రోజులుగా తిరునాల కొనసాగుతుంది. ఇందులో గృహోపకరణ వస్తువులు, వంట సామగ్రి, ఎలక్ట్రానిక్, ఆట బొమ్మలు, క్రీడా సామగ్రి దుకాణాలు ఏర్పాటు చేస్తారు. చుట్టు పక్కల గ్రామాల నుంచే కాక వైఎస్సార్ జిల్లా నుంచి అనేక మంది వస్తారు. పాత బస్టాండు నుంచి సంత మార్కెట్ వరకు అహోబిలం రోడ్డులో ఇరువైపుల అంగళ్లు ఏర్పాటు చేయడంతో ప్రజలకు ఇబ్బంది కలగకుండా మున్సిపల్, పోలీస్ అధికారులు పాతబస్టాండు నుంచి ప్రభుత్వ వైద్యశాల వరకు రోడ్డుకు అడ్డంగా గోడ నిర్మించారు. ఈ రహదారిలో వెళ్లే వాహనాలను దారి మళ్లించారు. ముత్యాలపాడు – చాగలమర్రి, అహోబిలం, రుద్రవరం తదితర గ్రామాల వైపు వెళ్లనున్న ఆర్టీసీ బస్సులు, ఆటోలు బైపాస్ రోడ్డులో తిరిగేలా ఏర్పాట్లు చేశారు.



వెలసిన గాజుల అంగళ్లు

నెహ్రూనగర్‌లో ప్రత్యేక పూజలు

గోస్పాడు: మండలంలోని నెహ్రూనగర్ గ్రామంలో గ్రామస్తుల సహకారంతో నూతనంగా నిర్మించిన శ్రీ విశాలాక్షి సమేత ఓంకారేశ్వర స్వామి ఆలయం ప్రతిష్ఠ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. రెండో రోజు ఆదివారం ప్రాతఃకాల పూజలు, వేదపారాయణం, మూలమంత్ర జపాదులు, యంత్రములకు, ప్రతిష్ఠామూర్తులకు మహాన్యాసపూర్వ రుద్రాభిషేకం, మహాలింగార్చన, పంచగవ్య, పంచామృతాభిషేకాలు, దుర్గాసప్తశతీ పారాయణాలు, యాగమండప దేవతా, ఆవాహిత హోమం, రుద్ర హోమం, దేవతా మూర్తుల గ్రామోత్సవము, మహామంగళ హారతి, సాయంత్రం ప్రదోషకాల పూజలు, మూలమంత్ర జపాదులు, దీక్షాహోమాలు, మహాస్నపనం, ప్రతిష్ఠామూర్తులకు ధాన్య, శయ్య, ఫల, పుష్ప అధివాసములు వంటి పూజలు చేశారు. గ్రామస్తులు పూజా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అభివృద్ధికి కృషి



అబ్దుల్ సలాం, ప్రతాపరెడ్డిని అభినందిస్తున్న కార్యకర్తలు

శిరివెళ్ల: పార్టీ వైభవం కోసం నిస్వార్థంగా పని చేస్తామని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బీ.అబ్దుల్ సలాం, మండల అధ్యక్షుడు ఇందూరి ప్రతాపరెడ్డి అన్నారు. రెండోసారి పదవులు లభించడంతో ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా వారిని ఆదివారం మండలంలోని గ్రామ నాయకులు, కార్యకర్తలు అభినందించారు. జెడ్పీ వైస్ చైర్మన్ దిల్షాద్‌నాయక్, ఎంపీపీ నాయక్ వసీం, దేవస్థానం మాజీ చైర్మన్ దాదిరెడ్డి తిమ్మరాయుడు, సర్పంచులు, ఎంపీటీసీలు అభినందించారు. మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలి



మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామచంద్రారెడ్డి, శివయ్య డిమాండ్ చేశారు. ఆదివారం ఏపీటీఎఫ్‌కు కృషి చేసిన రామకృష్ణ మృతి పట్ల సంస్మరణ సభను నిర్వహించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2023 జూలై 1 నుంచి అమలు కావాల్సిన పీఆర్సీ రెండు సంవత్సరాలుగా అమలు కాలేదన్నారు. తక్షణమే పీఆర్సీ వేసి అమలు చేయాలన్నారు. కరువు భత్యాలను విడుదల చేసి ప్రావిడెంట్ ఫండ్ రుణాలు, ఏపీజీఎల్ఐ రుణాలు, మెచ్యూరిటీ బాండ్లకు సంబంధించిన మొత్తాలను విడుదల చేయాలని, 2022 జూన్ నుంచి దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులకు సంపాదిత సెలవులకు సంబంధించిన మొత్తాన్ని విడుదల చేయాలన్నారు. 11వ పీఆర్సీ, అరియర్స్, పాత డీఏ బకాయిలు జమ చేయాలని కోరారు. సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. మాజీ అధ్యక్షుడు బాలనాగిరెడ్డి, జిల్లా సభ్యులు జాకీర్‌హుసేన్, వీరేశ్వరరెడ్డి, రాజ్‌కుమార్, కుమారి, రాములమ్మ, కృష్ణమోహన్, దస్తగిరిబాషా, నాగార్జున, వెంకటరాముడు, రవికుమార్ పాల్గొన్నారు.

6న జిల్లా టార్గెట్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 8, 9 తేదీల్లో ఈస్ట్ గోదావరిలో జరగబోయే సబ్ జూనియర్ 16 సంవత్సరాల్లోపు బాలురు, బాలికల టార్గెట్‌బాల్ పోటీల్లో పాల్గొనే నంద్యాల జిల్లా జట్టు కోసం ఈనెల 6వ తేదీన ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు నంద్యాల జిల్లా టార్గెట్‌బాల్ అసోసియేషన్ నిర్వాహక కార్యదర్శి నాగరాజు ఆదివారం తెలిపారు. బనగానపల్లె పట్టణంలోని నెహ్రూ ఇంగ్లిష్ మీడియం స్కూల్ క్రీడా ప్రాంగణంలో ఉదయం 10.30 గంటలకు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి గల క్రీడాకారులు ధ్రువీకరణ పత్రంతో హాజరు కావాలని సూచించారు. హ్యాండ్‌బాల్, బాస్కెట్‌బాల్ క్రీడల్లో ప్రావీణ్యం ఉన్న వారు కూడా అర్హులని తెలిపారు. వివరాలకు సెల్: 9000149695 నంబరులో సంప్రదించాలని కోరారు.

ప్రజాసమస్యలపై నిరంతర పోరాటాలు

గోస్పాడు: ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం ముందుండి పోరాడే పార్టీ సీపీఐ అని మండల కార్యదర్శి హరినాథ్, సహాయ కార్యదర్శి జిలానీ తెలిపారు. సీపీఐ శత జయంత్యుత్సవాలు జరుపుకుంటున్న సందర్భంగా ఆదివారం సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చి 8 నెలలు గడుస్తున్నా సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయలేదన్నారు. ప్రకటించిన పథకాలకు బడ్జెట్ లేదని చెప్పడం సిగ్గుచేటన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్ర ఎంపీలు కేంద్ర ప్రభుత్వంపై ఎందుకు ఒత్తిడి తీసుకురాలేదని ప్రశ్నించారు. అనంతరం పార్టీ సభ్యులకు సభ్యత్వాలు అందజేశారు. సహాయ కార్యదర్శి మౌలా, నాగరాజు, చిన్న ఉశేని, పాపన్న, రామకృష్ణ పాల్గొన్నారు.

4న సూర్యనారాయణ స్వామి కల్యాణోత్సవం



సూర్య నారాయణ స్వామి మూలవిరాట్



సూర్య నారాయణ స్వామి ఆలయం

నందికొట్కూరు: రథసప్తమి సందర్భంగా పట్టణంలోని కోటా వీధిలో వెలసిన శ్రీ సూర్య నారాయణ ఆలయంలో ఈనెల 4న స్వామివారి కల్యాణం, రథోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు సురేష్‌కుమార్, నాగభూషణరావు ఆదివారం తెలిపారు.

పట్టణంలోని పురవీధుల గుండా కల్యాణ మూర్తుల ఊరేగింపు ఉంటుందని చెప్పారు. మంగళవారం ఉదయం 5 గంటలకు స్వామి వారికి అభిషేకం, 8 గంటల నుంచి 10 గంటల వరకూ రథసప్తమి, దాతల కుంకుమార్చన కార్యక్రమం, 10 గంటల నుంచి కల్యాణ మహోత్సవం, మధ్యాహ్నం 1 గంటలకు స్వామి వారి తీర్థ ప్రసాద వినియోగం, 3 గంటల నుంచి పుర వీధుల గుండా కళ్యాణ మూర్తుల ఊరేగింపు జరుగుతుందన్నారు. కల్యాణంలో కూర్చునే దంపతులు రూ.300 చెల్లించి గోత్రనామములు నమోదు చేయించుకోవాలని కోరారు.

మూల పెద్దమ్మకు ప్రత్యేక పూజలు



దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయమే అమ్మవారిని నూతన పట్టువస్త్రాలతో అలంకరించి అభిషేకాలు, హారతులు పట్టారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

హుండీ సొమ్ము చోరీ

రుద్రవరం: మండలంలోని ఆర్.నాగులవరం నాగార్పమ్మ ఆలయంలోని హుండీ సొమ్ము చోరీకి గురైంది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. శనివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ఆలయంలోకి ప్రవేశించి అమ్మవారి ఎదురుగా ఉన్న హుండీని ఎత్తుకెళ్లారు. ఆలయంతో పాటు చుట్టుపక్కల సీసీ కెమెరాలు లేక పోవడంతో దుండగుల ఆధారాలు లభించలేదు. ఆలయం నిర్మించిన నాటి నుంచి ఇలాంటి ఘటనలు చోటు చేసుకోలేదని గ్రామస్తులు పేర్కొన్నారు.

ముగిసిన జాతీయ స్థాయి సెపక్‌తక్రా పోటీలు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని రామకృష్ణ పీజీ కళాశాలలో జాతీయ స్థాయి సెపక్‌తక్రా పోటీలు ఆదివారం ముగిశాయని క్రీడా భారతి గౌరవాధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, డైరెక్టర్ హేమంత్‌రెడ్డి, శాంతినికేతన్ విద్యాసంస్థల చైర్మన్ సుధాకర్ తెలిపారు. క్రీడా భారతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనుంజయ్ రెడ్డి మాట్లాడుతూ నంద్యాలలో జాతీయ స్థాయి సెపక్‌తక్రా పోటీలు విజయవంతం చేయడం అభినందనీయమన్నారు.

రేపు ప్రపంచ క్యాన్సర్ నివారణ దినం

నంద్యాల(వ్యవసాయం): ఈనెల 4వ తేదీన ప్రపంచ క్యాన్సర్ నివారణ దినం సందర్భంగా ఐఎంఏ ఉదయానంద క్యాన్సర్ ఆసుపత్రి మహిళా వైద్య విభాగం సంయుక్త నిర్వహణలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర రవికృష్ణ, నంద్యాల అధ్యక్షుడు మధుసూదన్, డాక్టర్ కల్పన ఆదివారం తెలిపారు. వారు మాట్లాడుతూ..4న ఆసుపత్రి నుంచి కలెక్టర్ ఆఫీసు వరకు ర్యాలీ నిర్వహిస్తామన్నారు. ముఖ్యఅతిథిగా న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పాల్గొంటారని చెప్పారు.


ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజన సేవ

నంద్యాల(వ్యవసాయం): త్వరలో జరిగే జంబులా పరమేశ్వరి తిరునాలను పురస్కరించుకొని కుందూ నది ఒడ్డున ఉన్న శ్రీజంబులాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం మన ఊరు, మనగుడి–మన బాధ్యత సభ్యుల ఆధ్వర్యంలో ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజన సేవ (ఆలయాన్ని శుభ్రం చేయడం) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని పరిసరాలను, గోపురాలను శుభ్రం చేశారు. ఉత్సవ మూర్తులు, పూజా సామగ్రిని శుభ్ర పరిచారు. ఆలయ కమిటీ సభ్యుడు జగన్ మాట్లాడుతూ శివకుమార్‌రెడ్డి, సభ్యుల ఆధ్వర్యంలో ఆలయాన్ని శుభ్ర పరచడంపై కృతజ్ఞతలు తెలియజేశారు.

కల్వర్టు నిర్మాణానికి నిధుల మంజూరు

ఉయ్యాలవాడ : మండలంలోని భీమునిపాడు, ఆర్.జంబులదిన్నె ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిలో ఇంజేడు గ్రామ సమీపంలో నూతన కల్వర్టు నిర్మాణానికి ప్రభుత్వం రూ.60 లక్షలు మంజూరు చేసిందని ఆర్‌అండ్‌బీ జేఈ రెడ్డి గోవిందు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఈ రహదారిలో ఇంజేడు, పెద్దయమ్మనూరు గ్రామాల మధ్య 30 సంవత్సరాల క్రితం లోలెవెల్ వంతెన నిర్మించారు. వర్షా కాలం, నిత్యం పొలాల్లోని వృథా నీరు ఈ వంతెనపై 3 అడుగులకు పైగా ప్రవహిస్తోంటుంది. దీంతో ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, కార్లు వెళ్లేందుకు ఇబ్బందిగా మారింది. వృథా నీరు, వర్షపు నీరు వెళ్లేందుకు లోలెవెల్ వంతెన స్థానంలో పైపుల కల్వర్టు నిర్మించనున్నట్లు జేఈ వెల్లడించారు.

అవర్ ఆర్టిస్ట్స్ బుక్కులోకి కోటేష్ చిత్రాలు



అవర్ ఆర్టిస్ట్స్ బుక్‌లోకి ఎక్కిన చిత్రం

నంద్యాల(అర్బన్): నంద్యాల చిత్రకారుడు చింతలపల్లె కోటేష్ గీచిన ఆరు చిత్రాలు అవర్ ఆర్టిస్ట్స్ బుక్కులోకి వెళ్లాయి. బుక్కులో రెండు పేజీలు కేటాయించి కోటేష్ గురించి, ఆయన వేసిన చిత్రాలను ప్రదర్శించారు. చిత్రకళలో చేస్తున్న సేవలకు చిత్ర కళామిత్ర అవార్డును ప్రదానం చేశారు. ఆర్ట్ బుక్కు, అవార్డు సర్టిఫికెట్‌ను కొరియర్ ద్వారా ఆదివారం కోటేష్ అందుకున్నారు. కోటేష్ మాట్లాడుతూ తూర్పుగోదావరి జిల్లా అమలాపురంలోని కోనసీమ చిత్రకళా పరిషత్ 35వ చిత్రకళ బ్రహ్మోత్సవ వేడుకల సందర్భంగా గత నెల 19న అంతర్జాతీయ చిత్రకళా ప్రదర్శన, అవర్ ఆర్టిస్ట్స్ అనే పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగిందన్నారు. ప్రసిద్ధ చిత్రకారులు పరిషత్ వ్యవస్థాపకులు కొరసాల సీతారామస్వామి ప్రతిభ గల చిత్రకారులకు గుర్తింపు ఇవ్వాలని, దాదాపు మూడు సంవత్సరాల నుంచి అన్వేషించి దేశంలో నైపుణ్యం గల 215 మంది కళాకారులు, వారు వేసిన చిత్రాలను బుక్‌లో ప్రచురించి ప్రపంచానికి తెలియజెప్పారన్నారు. అందులో తాను వేసిన రెండు గణేషుడి చిత్రాలు రాధాకృష్ణ, బుద్ధుని సందేశం, అనుబంధం, పూసలు అమ్మే అమ్మాయి చిత్రాలకు స్థానం ఇవ్వడం ఆనందంగా ఉందని చెప్పారు.

రేపు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లీ సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం స్వామివారి షష్ఠి నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ రామక్రిష్ణ తెలిపారు. ఉదయం నుంచి స్వామివారికి విశేష పూజలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అలాగే ఆలయ ప్రాంగణంలో స్వామివారి కల్యాణోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.

స్వర్గధామంలో స్వచ్ఛభారత్



శ్మశానవాటికను శుభ్రం చేస్తున్న సభ్యులు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న హిందూ శ్మశాన వాటికలో ఆదివారం స్వర్గధామం సేవకుల ఆధ్వర్యంలో చెత్తాచెదారం, కంప చెట్లు, కాల్వలను శుభ్రం చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గౌరవాధ్యక్షుడు డాక్టర్ మధుసూదనరావు పేర్కొన్నారు. అనంతరం స్వర్గధామం సేవకులను సన్మానించి వారికి గుర్తింపు కార్డులు, వివిధ ఆసుపత్రుల్లో ఉచిత ఓపీ, మందులు ఇచ్చేలా టోకెన్లు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ శివప్రసాదరెడ్డి, రామకృష్ణ, రావినూతల దుర్గాప్రసాద్, గెలివి సహదేవుడు, పాండురంగాయ్య, సుదర్శనం పాల్గొన్నారు.


వేప చెట్టుకు పాలధార



మద్దూరు వద్ద జాతీయ రహదారి సమీపంలో నున్న వేప చెట్టుకు పాలధార వెలువడుతున్న దృశ్యం

చాగలమర్రి: మండలంలోని మద్దూరు గ్రామ సమీపంలోని జాతీయ రహదారి–40 వద్ద ఉన్న గుజారాతీ దాబా ఎదురుగానున్న వేప చెట్టుకు ఆదివారం సాయంత్రం 6 గంటల నుంచి పాలధార వస్తుండటంతో పరిసర ప్రాంతాల ప్రజలు వింతను చూసేందుకు తరలివచ్చారు. సుమారు రెండు గంటలకు పైగా పాలధార కొనసాగింది.కాలజ్ఞానంలో వీరబ్రహ్మేంద్రస్వామి చెప్పినట్లుగా సాగుతోందని జనం చర్చించుకున్నారు.

తూడిచెర్ల సబ్‌చానల్‌కు 655 క్యూసెక్కులు



కేసీ కాల్వలో ప్రవహిస్తున్న నీరు

జూపాడుబంగ్లా: లాకిన్సలా నుంచి తూడిచెర్ల సబ్‌ఛానల్‌కు 655 క్యూసెక్కుల సాగునీటిని సరఫరా చేస్తున్నట్లు కేసీ కాల్వ ఏఈ శ్రీనివాసనాయక్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సుంకేసుల డ్యాం నుంచి కేసీ కాల్వకు 2,100 క్యూసెక్కుల సాగునీరు సరఫరా అవుతోందన్నారు. రైతుల వినియోగార్థం లాకిన్సలా వరకు 815 క్యూసెక్కుల నీరు చేరుతుందన్నారు. ఈ నీటిని ఏబీఆర్ కాల్వకు 150 క్యూసెక్కులు, నిప్పులవాగుకు 10 క్యూసెక్కులు, తూడిచెర్ల సబ్‌చానల్ కాల్వకు 655 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల పథకాల నుంచి కేసీ కాల్వకు సాగునీటిని బంద్‌చేసినట్లు వెల్లడించారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ఉయ్యాలవాడ : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్‌బాబు ఆదివారం తెలిపారు. సమస్యలపై మండల ప్రజలు వినతులు అందజేయవచ్చునని వెల్లడించారు. రెవెన్యూ కార్యాలయంలో జరిగే ఈ ప్రజా వేదికకు అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని సూచించారు.